# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 92 | శుక్రవారం 05, డిసెంబర్ 2025 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




## క్వాంటం సిటీగా హైదరాబాద్

దేశంలోనే తొలిసారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"

స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ప్రత్యేకంగా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

02



## సెంటిమెంట్ రగిలించే కుట్ర

బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెడితే తప్పేంటి

ఆయన ఓ ప్రాంతానికి పరిమితం కాదు కదా

కిషన్ రెడ్డి బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారు

పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు

03



# పార్టీలకతీతంగా పరిపాలన కొనసాగిస్తున్నాం

## ఆదిలాబాద్ కు ఎయిర్ బస్సు తీసుకొస్తాం

ఇక్కడికి ఎర్రబస్సు రావడమే కష్టంగా ఉండేది

ప్రజా ప్రభుత్వం రెండేండ్లు పూర్తి చేసుకున్నది

దేవుడి దయవల్ల చిన్న వయసులో సీఎం అయ్యాను

గత పాలన మొత్తం నిర్బంధ రాజ్యమే

ఎమ్మెల్యేలకు నిధులు వచ్చేవి కాదు

సచివాలయానికి ఎవ్వరినీ రానిచ్చేవాళ్లు కాదు

ఆదిలాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ప్రజాస్వరం

ఆదిలాబాద్‌లో పరిశ్రమల ప్రగతికి కొత్త దారులు తీసుకురావడమే లక్ష్యంగా ప్రజాపాలన ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ''ఎర్రబస్సు రావడమే కష్టమనుకున్న అడవిలాంటి జిల్లా ఆదిలాబాద్‌లో ఇక ఎయిర్‌బస్ దిగే సమయం వస్తోంది'' అని వ్యాఖ్యానించిన సీఎం, వచ్చే ఏడాది తిరిగేలోపే ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణ పనులు భూమి పూజ దశలోకి వెళ్తాయని హామీ ఇచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల భాగంగా ఆదిలాబాద్ పర్యటనలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి, రూ.18.7 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.''రెండేళ్ల క్రితం ప్రజలు ఓటును ఆయుధంగా మార్చి నిరంకుశ పాలనకు గుడ్‌బై చెప్పారు. ఇప్పుడు ఆ ప్రజలే తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంటోంది. సంక్షేమం-అభివృద్ధి మా ప్రభుత్వానికి ..మిగతా 3లో



## క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్

తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా క్వాంటం రోడ్డు మ్యాప్ ఉంది

క్వాంటం రోడ్డు మ్యాప్ కలిగిన తొలి రాష్ట్రం తెలంగాణ

రాష్ట్ర, దేశ అభివృద్ధికి క్వాంటం టెక్నాలజీ కీలకం

క్వాంటం స్టార్ట్ అప్ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ప్రజాస్వరం

భవిష్యత్తు క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్ నిలుస్తుంది, ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి అన్ని వనరులు హైదరాబాదులో దండిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. నీతి ఆయోగ్ రోడ్డు మ్యాప్ "తెలంగాణ రైజింగ్ 2047", 2047 నాటికి తెలంగాణను $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చే రాష్ట్ర దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించబడింది అని అభివర్ణించారు.తెలంగాణ క్వాంటం వ్యూహం ద్వారా క్వాంటం టెక్నాలజీకి ప్రత్యేక రోడ్‌మ్యాప్ కలిగిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ ..మిగతా 3లో

## మేం అధికారంలోకి వచ్చాక ఆ భూములను వెనక్కి తీసుకుంటాం

పారిశ్రామిక వేత్తలకు కేటీఆర్ హెచ్చరిక!



హైదరాబాద్, ప్రజాస్వరం

నాడు పరిశ్రమలకు రాయతీపై విలువైన భూములు కేటాయించారు.. హైదరాబాద్, శివారు ప్రాంతాల్లో భూముల ధరలు ఇపుడు భారీగా పెరిగాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తాజాగా కుత్బుల్లాపూర్‌లో పర్యటిస్తున్న ఆయన మీడియాతో మాట్లాడారు. జీడిమెట్ల ప్రాంతంలోని పారిశ్రామిక వాడలో 75 వేల కోట్ల వరకు విలువ చేసే భూములు ఉన్నాయి.. రెండేళ్లలో ఒక్క ఇందిరమ్మ ..మిగతా 3లో



## రాజీవ్, ఇందిర పేర్లేనా.. శ్రీకాంతాచారి పేరు ఏది?

ఒక్క ప్రాజెక్టుకైనా శ్రీకాంతాచారి పేరు పెట్టారా? అని కాంగ్రెస్‌ను ప్రశ్నించిన కవిత

ప్రాజెక్టులకు రాజీవ్, ఇందిర, మన్మోహన్ పేర్లు పెడుతున్నారని ఆరోపణ

03



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

బీజాపూర్ జిల్లాలో భీకర పోరు

ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు వీరమరణం

ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం

హైదరాబాద్, ప్రజాస్వరం

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మరణించారు. ఈ భీకర కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది కూడా వీరమరణం పొందారు. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు ఇదే అతిపెద్ద నష్టమని అధికారులు భావిస్తున్నారు.గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ..మిగతా 2లో



## రాహుల్ వ్యాఖ్యలకు కంగనా కౌంటర్

రాహుల్ గాంధీ దేశభక్తిపై అనుమాముందన్న కంగనా రనౌత్

వాజ్‌పేయిలా కావాలంటే రాహుల్ బీజేపీలో చేరాలని సూచన

తాము కేవలం ప్రోటోకాల్ పాటిస్తున్నామని స్పష్టం చేసిన బీజేపీ

ఎవరిని కలవాలో విదేశీ నేతలే నిర్ణయించుకుంటారన్న జేడీయూ

02

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఏపీకి పరిశ్రమలు

శంకుస్థాపన బాటలో సగానికి పైగా ఎంఓయూలు

ప్రాసెస్ లోకి వచ్చిన రూ.7.69 కోట్ల పెట్టుబడులు

45 రోజుల్లోగా మెజార్టీ ఎంఓయూలు గ్రౌండింగ్ కావాలి

డ్వాక్రా మహిళల ద్వారా పశువుల దాణా తయారీ పరిశ్రమలు

క్వాంటం వ్యాలీకి సలహా మండలి నియమించండి

13వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

రూ. 20,444 కోట్ల పెట్టుబడులకు... 56,278 ఉద్యోగాలకు ఎస్ఐపీబీ ఆమోదం

అమరావతి, ప్రజాస్వరం:

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాల్లో 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, 45 రోజుల్లోగా వీటికి శంకుస్థాపన జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన గురువారం సచివాలయంలో 13వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల బోర్డు సమావేశం జరిగింది. ఇందులో రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు 13వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. దీంతో 56,278 మందికి ఉద్యోగావకాశాలు వస్తాయి. ఇటీవల ..మిగతా 2లో



## కూటమి నాయకుల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలం

15 ఏళ్లు ఇదే స్ఫూర్తి కొనసాగితే అభివృద్ధి సుస్థిరమవుతుంది

వైసీపీ పాలనలో దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెడుతున్నాం

చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుందాం

చిత్తూరులో కూటమి పార్టీల నాయకులతో సమావేశమైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

02





## టోల్‌ప్లాజా వద్ద సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థ

త్వరలో ఒక్క క్షణం ఆగకుండా సరికొత్త వ్యవస్థ

లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించిన గడ్కరీ

ఇప్పటికే 10 ప్రాంతాల్లో అమలు చేస్తున్నామన్న గడ్కరీ

02

## టోల్‌ప్లాజా వద్ద సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థ

- త్వరలో ఒక్క క్షణం ఆగకుండా సరికొత్త వ్యవస్థ
- లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో వెల్లడించిన గడ్కరీ
- ఇప్పటికే 10 ప్రాంతాల్లో అమలు చేస్తున్నామన్న గడ్కరీ



హైదరాబాద్, ప్రజాస్వరం

టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు ఒక్క క్షణం కూడా ఆగకుండా ఉండేందుకు వీలుగా సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థను మరికొద్ది నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ వ్యవస్థను ఇప్పటికే 10 ప్రాంతాల్లో అమలు చేస్తున్నామని, ఒక సంవత్సరం లోపు దేశ వ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన అన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుత విధానానికి స్వస్తి పలికి, ఏడాదిలో దేశవ్యాప్తంగా కొత్త విధానం అమల్లోకి రానుందని ఆయన స్పష్టం చేశారు. "ప్రస్తుత టోల్ వసూలులో ఉన్న విధానానికి బదులుగా కొత్త ఎలక్ట్రానిక్ విధానం అమలులోకి రానుంది. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత టోల్‌ప్లాజాల వద్ద ఎవరూ మిమ్మల్ని ఆపరు. దేశవ్యాప్తంగా దీనిని త్వరలో అమలు చేస్తాం" అని గడ్కరీ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రూ.10 లక్షల కోట్ల విలువైన 4,500 హైవే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) ఇటీవల విడుదల చేసిన ప్రకటన ప్రకారం, టోల్‌ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఎన్పీసీఐ తీసుకువచ్చింది. ఇది ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. టోల్‌ప్లాజా మీదుగా వాహనం వెళ్లినప్పుడు ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంకు ఖాతా నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండోలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు దీటుగా స్పందించాయి. చాలా గంటల పాటు సాగిన ఈ పోరులో తొలుత 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు ప్రకటించారు. గురువారం ఉదయం ఘటనా స్థలంలో జరిపిన గాలింపు చర్యల్లో మరో ఆరు మృతదేహాలు లభించడంతో మృతుల సంఖ్య 18కి చేరింది. ఈ పోరాటంలో డీఆర్‌జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ మోను మోహన్ బడ్డి, కానిస్టేబుల్ దుకారు గోండే, జవాన్ రమేశ్ సోడీ కూడా మరణించారు. వారి మృతదేహాలను బీజాపూర్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించి, ఉన్నతాధికారులు, తోటి జవాన్లు ఘనంగా నివాళులర్పించారు. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర సింగ్ మీనా తెలిపారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

## రాహుల్ వ్యాఖ్యలకు కంగనా కౌంటర్

- రాహుల్ గాంధీ దేశభక్తిపై అనుమానముందన్న కంగనా రనౌత్
- వాజ్‌పేయిలా కావాలంటే రాహుల్ బీజేపీలో చేరాలని సూచన
- తాము కేవలం ప్రోటోకాల్ పాటిస్తున్నామని స్పష్టం చేసిన బీజేపీ
- ఎవరిని కలవాలో విదేశీ నేతలే నిర్ణయించుకుంటారన్న జేడీయూ




హైదరాబాద్, ప్రజాస్వరం

కాంగ్రెస్ ఎంపీ, లోక్ సభలో విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా స్పందించారు. రాహుల్ గాంధీకి దేశం పట్ల ఉన్న నిబద్ధత ప్రశ్నార్థకమని, ఆయన దేశంలో అశాంతి సృష్టించి, విభజించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఒకవేళ రాహుల్ గాంధీ... అటల్ బిహారీ వాజ్‌పేయి గారితో తనను తాను పోల్చుకోవాలనుకుంటే, ముందు బీజేపీలో చేరాలని ఆమె సూచించారు. అప్పుడు మాత్రమే ఆయన వాజ్‌పేయిలా మారగలరని ఎద్దేవా చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు కొన్ని గంటల ముందు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై కీలక ఆరోపణలు చేశారు. విదేశీ ప్రతినిధులు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతతో సమావేశం కాకుండా కేంద్రం అడ్డుకుంటోందని, ఇది గతంలో వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలో ఉన్న సంప్రదాయానికి విరుద్ధమని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలే తాజా రాజకీయ దుమారానికి కారణమయ్యాయి. రాహుల్ ఆరోపణలను బీజేపీ నేతలు తోసిపుచ్చారు. ప్రభుత్వం అన్ని విషయాల్లో నిబంధనల ప్రకారమే (ప్రోటోకాల్) నడుచుకుంటుందని స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్‌తో మాట్లాడుతూ, "రాహుల్ ఎక్కడ మాట్లాడాలో అక్కడ మాట్లాడరు. కేవలం గందరగోళం సృష్టించడమే ఆయన పని" అని మరో బీజేపీ ఎంపీ భీమ్ సింగ్ అన్నారు. రాహుల్ ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని ఇంకో ఎంపీ బ్రిజ్ లాల్ విమర్శించారు. అయితే, ఈ విషయంలో ప్రభుత్వ ప్రమేయం ఉండదని జేడీయూ నేత కేసీ త్యాగి, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. పర్యటనకు వచ్చే దేశాధినేతలే తాము ఎవరిని కలవాలనుకుంటున్నారో స్వయంగా నిర్ణయించుకుంటారని, ఇందులో ప్రభుత్వ పాత్ర ఉండదని వారు స్పష్టం చేశారు. పుతిన్ కోరుకుంటే ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ ఆయనను కలవవచ్చని అథవాలే పేర్కొన్నారు.

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే ఏపీకి పరిశ్రమలు

మొదటిపేజీ తరువాయి



విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు కూడా ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. అలాగే విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని చూసే ప్రముఖ సంస్థలు పెద్దఎత్తున ఏపీకి వస్తున్నాయి. కంపెనీలు స్థాపించడానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ఆయా కంపెనీలకు అవసరమైన నీరు, విద్యుత్, భూమి వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాం. వాటి విషయంలో పారదర్శకత పాటిస్తుండడం వల్లనే ప్రాజెక్టులు ఏపీకి వస్తున్నాయి. గత పాలకులు సింగపూర్ లాంటి దేశాన్నే ఇబ్బందులు పెట్టారు. ఆ దేశ కంపెనీలను ఇబ్బంది పెట్టారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు. అంతర్జాతీయ స్థాయిలో చెడ్డ పేరు వస్తుంది. మనం ఆ బ్యాడ్ ఇమేజ్ ని చెరిపేసి... ఏపీకి బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చాం. అందుకే ఇటీవల మనం నిర్వహించిన పెట్టుబడుల సదస్సుకు మంచి స్పందన వచ్చింది.' అని సీఎం అభిప్రాయపడ్డారు.

**20 రోజుల్లోనే ఆచరణ దిశగా...**

"20 రోజుల క్రితం విశాఖ భాగస్వామ్య సదస్సు నిర్వహిస్తే... ఇప్పటికే రూ.7.69 కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ ఎంఓయూలు అన్నింటికీ ఏయే జిల్లాల్లో ఏర్పాటు చేయాలి... ఎక్కడెక్కడ భూములివ్వాలనే అంశంపైనా నిర్ణయాలు జరిగాయి. ఇక మిగిలిన ఎంఓయూలను వీలైనంత త్వరగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా ఎంఓయూలు అన్నింటినీ గ్రౌండింగ్ అయ్యేలా చూడాలి. వీలైనన్ని ఎంఓయూలను గ్రౌండింగ్ చేసి... దావోస్ సదస్సుకు వెళ్తే మరిన్ని పెట్టుబడులను వస్తాయి. త్వరితగతిన ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాలి. దావోస్ పర్యటనకు ముందే 75 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన జరిగేలా చూడాలి. ఎంఓయూల గ్రౌండింగ్‌పై ప్రతీ వారం సీఎస్ సమీక్షించాలి. ఇక నుంచి ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూలపైనా స్వయంగా సమీక్షిస్తాను. జిల్లా కలెక్టర్లు కూడా వీటిపై దృష్టి పెట్టాలి. ఇక పరిశ్రమలు గ్రౌండింగ్ అయ్యే విధానానికి సంబంధించి ఓ విధానాన్ని రూపొందించండి. ఆ విధానాన్ని కెబినెట్లో ఆమోదిద్దాం. ముఖ్యమంత్రి, మంత్రి వర్గ ఉప సంఘం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా ఆయా శాఖలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులతో మోనిటరింగ్ రివ్యూ మెకానిజం ఏర్పాటు చేసుకుందాం. ఇక భూసేకరణలో ఎక్కడా వివాదాలు రాకుండా చూడాలి. భూములకు సంబంధించి ఒక్క ఫిర్యాదు రాకూడదు. భూములు తీసుకున్న వాళ్లు ఎంతో సంతోషంగా ఉంటారో... ఇచ్చిన వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ప్రభుత్వ యంత్రాంగం కూడా నైపుణ్యాలు పెంచుకోవాలి**

"ఆమోదం పొందిన యూనిట్లు, పరిశ్రమలు నిర్దేశిత గడువులోగా ఏర్పాటు చేయాల్సిందే. దీనిపై అధికారులు ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలి. వివిధ రంగాల్లో ఏపీని అభివృద్ధి చేయాలని చూస్తున్నాం. అలాగే రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం కూడా పూర్తిగా టెక్నాలజీపై గ్రిప్ పెంచుకోవాలి. లేకుంటే మనం వెనుకబడిపోతాం. ఇదే కాకుండా... భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రంలోని యువతను సిద్ధం చేయాలి. ఈ మేరకు వివిధ రంగాల్లో వారిని నైపుణ్యాలు అందించేలా చూడాలి. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ, గ్రీన్ ఎనర్జీ యూనివర్సిటీ వంటివి ఏర్పాటు చేయాలి. క్వాంటం వ్యాలీకి అడ్వైజరీ బాడీని నియమించండి. మెంటరింగ్, మోనిటరింగ్, వెంచర్ క్యాపిటల్ కోసం ఇది పనిచేయాలి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అనేది స్టార్టప్‌లకు ఓ మెంటార్ గా వ్యవహరిస్తుంది. క్వాంటం వ్యాలీలో నిర్మించే 6 క్వాంటం టవర్లలో రెండు టవర్లను క్వాంటం అల్గారిథం డెవలప్మెంట్ కోసం... మరో రెండు టవర్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ కోసం కేటాయించండి. ఏఐ బేసిక్స్‌ను 7 తరగతి నుంచే బోధించేలా చర్యలు చేపట్టండి. మైక్రోసాఫ్ట్, గుగూల్ లాంటి కంపెనీల సాయంతో బృందాన్ని ఏర్పాటు చేయండి. పర్యాటక కేంద్రాలకు ప్రచారం కల్పించండి. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆతిధ్య రంగంలోనూ, పర్యాటక రంగంలోనూ రావాలి. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల కోసం 50 ఎకరాలు కేటాయించండి. దీనికి అవసరమైన మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ప్రాజెక్టు స్థాయిని బట్టే ప్రోత్సాహకాలు అందాలి. లార్జ్, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులుగా వర్గీకరించాలి. మనం ఇచ్చే ప్రోత్సాహకాలు ఎస్క్రో ఖాతాకు జమ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకురావాలి." అని సీఎం సూచించారు.

**సావరిన్ ఫండ్ ఏర్పాటు చేద్దాం...**

"ప్రభుత్వ రంగ సంస్థలే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకోవాలి. యూఏఈ, దుబాయ్, సహా మరికొన్ని దేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థలు లక్షల కోట్ల రూపాయలతో సావరిన్ ఫండ్ ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ప్రభుత్వ కంపెనీలతోనే వివిధ రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. ఏపీ కూడా ఆ స్థాయికి రావాలి. రూ.500 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం సావరిన్ ఫండ్ ఏర్పాటు చేయాలి. ఇక ఎర్లీబర్డ్ ప్రోత్సాహకాల అవకాశాలను మిగతా వారికి కూడా అందించేలా అన్ని శాఖలూ చూడాలి. ఈ మేరకు ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలపై వెసులుబాటు కల్పించేలా పాలసీని సడలించండి. లైవ్ స్టాక్ పరిశ్రమ రూ. 8 లక్షల కోట్లకు చేరాలన్నదే మన లక్ష్యం. ఆ దిశగా మార్గదర్శకాలు రూపొందించండి. పశువుల మేతను డ్వాక్రా సంఘాల ద్వారా తయారు చేయగలిగితే వారికి మంచి ఆదాయ మార్గం అవుతుంది. నరేగా ద్వారా వాటిని ప్రోత్సహించేందుకు అవకాశం ఉంటుంది. 9 జిల్లాలను హార్టీ కల్చర్ హబ్ గా తయారు చేస్తున్నాం. దీంట్లో భాగంగా పూర్వోదయ స్కీం కింద కేంద్రం రూ. 40 వేల కోట్లు ఇస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించాలి. హార్టికల్చర్ ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా రైల్, రోడ్, ఎయిర్, వాటర్ కనెక్టివిటీ కూడా పెరగాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**పరిశీలన తర్వాతే అనుమతులు: మంత్రి నారా లోకేష్**

ఎస్ఐపీబీ సమావేశం సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... 'పెట్టుబడులు పెట్టే ప్రతి కంపెనీని పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతివ్వాలని మంత్రి చెప్పారు. ఇదే సమయంలో పరిశ్రమ ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని మంత్రి లోకేష్ సూచించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని... ప్రభుత్వ సమయం, కంపెనీల సమయం వృధా కాకుండా పెట్టుబడులకు త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని లోకేష్ సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు టీజీ భరత్, పి.నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ హాజరయ్యారు. మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు వర్చువల్ గా హాజరయ్యారు. సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కూటమి నాయకుల ఐక్యతే రాష్ట్రాభివృద్ధికి మూలం

- 15 ఏళ్లు ఇదే స్ఫూర్తి కొనసాగితే అభివృద్ధి సుస్థిరమవుతుంది
- వైసీపీ పాలనలో దిగజారిన వ్యవస్థలను తిరిగి నిలబెడుతున్నాం
- క్షేత్రస్థాయిలో ప్రజల గొంతుకగా మారుదాం
- చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్ ఉంటే కలిసి మాట్లాడుకుందాం
- చిత్తూరులో కూటమి పార్టీల నాయకులతో ప్రత్యేకంగా సమావేశమైన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్

హైదరాబాద్, ప్రజాస్వరం



"వర్షించని మేఘం... శ్రమించని మేధావి" ఉన్నా, లేకపోయినా ఒక్కటే. అలాగే కూటమి ప్రభుత్వానికి ఇంత బలం ఉండి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవస్థల్లో మార్పులు తీసుకురాకపోతే మనకు ఎన్ని పదవులు ఉన్నా నిష్ప్రయోజనమే అని ఉప ముఖ్యమంత్రివర్యులు, జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో సమూల మార్పులు తీసుకురావాలనే రాష్ట్రవ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసులు ప్రారంభించామని, ఏళ్ల తరబడి ప్రమోషన్లకు నోచుకోని 10 వేల మంది పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించగలిగామని అన్నారు. ఒక ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా పదోన్నతి ఎంత కీలకమో తెలుసు కాబట్టే... ఎటువంటి పైరవీలకు తావు లేకుండా అర్హతే ఆధారంగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించామన్నారు. గురువారం చిత్తూరు రెడ్డిగుంట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసును ప్రారంభించిన అనంతరం జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఈ రోజు కూటమి ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనపై ఇంత బలంగా ముందుకు వెళ్తుందంటే దానికి కారణం మీ అందరి మద్దతు. మీరు ప్రభుత్వానికి అండగా నిలబడడంతోనే ఇదంతా సాధ్యమైంది.

**స్వచ్ఛరథాలు పరిశీలన**

స్వచ్ఛాంధ్ర స్ఫూర్తిని పల్లె ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ప్రయోగాత్మకంగా చేపట్టిన స్వచ్ఛరథాలను శ్రీ పవన్ కళ్యాణ్ గారు పరిశీలించారు. తిరుచానూరు, కరకంబాడి పంచాయతీల నుంచి తీసుకొచ్చిన స్వచ్ఛ రథాల దగ్గరకు వెళ్లి ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. పొడి చెత్త, పనికిరాని వస్తువులు తీసుకొస్తే ప్రజలకు అందిస్తున్న నిత్యావసరాలను పరిశీలించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని అధికారులను అభినందించారు.

**మన ఐక్యతే రాష్ట్రానికి బలం**

కూటమిలో ఉన్న మూడు పార్టీల నాయకులకు విభిన్న భావజాలాలు ఉన్నా... మనందరం "రాష్ట్రం బాగుండాలి అరాచకాలు ఉండకూడదు" అనే సదుద్దేశంతో ఒక గొడుగు కిందకు వచ్చి కూటమిగా ఏర్పడ్డాం. మనలో మనకు చిన్న చిన్న కమ్యూనికేషన్ గ్యాప్స్, మనస్పర్థలు ఉండటం సహజం. ఒక చోట కూర్చొని మాట్లాడుకుంటే అన్ని సమస్యలు తీరతాయి. ఆ రోజు చిన్నగా మొదలుపెట్టిన కూటమి ఈ రోజు కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వానికి ఎంతో బలమైన శక్తిగా మారింది. ఈ రోజు ఇంతమందికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వగలిగామంటే కారణం మనందరి ఐక్యతే. ఇదే ఐక్యతతో మరో 15 ఏళ్లు కష్టపడితే రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యం అవుతుంది.

**కష్టపడితేనే... ప్రతిఫలం**

నేను 2008 నుంచి రాజకీయాల్లో ఉన్నాను. ఏనాడు కూడా గుర్తింపు కోరుకోలేదు. సమాజంలో నిస్సహాయులైన వ్యక్తులకు అండగా నిలబడడమే నాయకుడి లక్షణం. నిస్వార్థంగా మన పని మనం చేసుకుపోతే గుర్తింపు, పదవి వాటికవే వస్తాయి. అంతే తప్ప పదవే పరామావధిగా భావించి పని చేస్తే అందలం ఎక్కడం కష్టం. ఏ వ్యక్తికి అయినా పదవి అనేది బాధ్యత తప్ప అలంకారంగా మారకూడదు. మన జిల్లాకే తలమానికం అయిన శేషాచలం అడవులను అడ్డగోలుగా దోచేశారు. ఇప్పటి వరకు దొరికిన సంపద కేవలం 10 శాతం మాత్రమే... దొరికిన పది శాతం విలువే వేలకోట్లలో ఉంటే... ఇప్పటి వరకు దొరకని సంపద విలువ ఎన్ని వేల కోట్లు ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి వాళ్లను మనం నిలువరించాలి. అవినీతిని అరికట్టి బలహీనుల గొంతుగా మారాలి. నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన శ్రీ చంద్రబాబు గారినే రాష్ట్రంలో ఒక నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వం అని గత పాలకులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేయడానికి భయపెట్టాలని చూడటం మనం చూశాం. అయినా జనసేన ఎక్కడా తగ్గలేదు. పంచాయతీ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి నిలబడ్డారు. జనసేన పార్టీ ముఖ్య లక్ష్యం సమాజంలో కోల్పోయిన ధైర్యాన్ని నింపడం. ఆ దిశగా పార్టీ అడుగులు వేస్తుంది. కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకొని మరి గుర్తింపు ఇస్తాం. గ్రామ స్థాయి నుంచి లోక్ సభ నియోజక వర్గం వరకు ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేస్తాం" అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీ గురజాల జగన్మోహన్, శ్రీ అరణి శ్రీనివాసులు, శ్రీ కె. మురళీమోహన్, శ్రీ అరవ శ్రీధర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ శ్రీ కొట్టే సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## క్వాంటం సిటీగా హైదరాబాద్

హైదరాబాద్, ప్రజాస్వరం

"క్వాంటం సిటీ"గా హైదరాబాద్ ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "క్వాంటం టెక్నాలజీ"లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలి సారిగా "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని "ఐఐటీ హైదరాబాద్"లో "నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం & తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ"ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతుందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. "లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ"లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్ లో ఆర్అండ్ డీ, ఇన్నోవేషన్స్ ను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమే కాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశా నిర్దేశం చేసే "డైరెక్షన్" అని అన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా "సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్"కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా "ఫండ్స్ ఆఫ్ ఫండ్స్"ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. "ఇండస్ట్రీ డే" పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పరిష్కార మార్గాలు, రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, మెంబర్ డా. వీకే సారస్వత్, దేబ్ జానీ ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
05.12.2025
శుక్రవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# మేం అధికారంలోకి వచ్చాక ఆ భూములను వెనక్కి తీసుకుంటాం

మొదటిపేజీ తరువాయి

ఇళ్లు కూడా కట్టలేదన్నారు. ఇండ్లు కట్టవచ్చు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కట్టవచ్చు కానీ, ఇవేవీ చేయరట.. శ్మశాన వాటికలకు కూడా స్థలం లేదు.. కాలుష్యాన్ని నివారించాలని అనడంలో ఎవరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. మార్కెట్ ధరకు కూడా కాదు... రిజిస్ట్రేషన్ ధరలో 30 శాతం ఇచ్చి ఏమైనా చేసుకోవచ్చు అని ప్రభుత్వం అంటోంది.. ప్రైవేట్ వ్యక్తుల జేబులు నిండాలని కాదన్నారు. ఐదు లక్షల కోట్ల కుంభకోణంపై బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని నిర్ణయించిందని.. ప్రజల ఆస్తిని సరైన పద్ధతిలో వినియోగించండన్నారు. ప్రజల కోసం వినియోగించండి, గ్రీన్ ఇండస్ట్రీస్ పెట్టండని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చే ఆషాఢ సేల్ లాంటి ఆఫర్ ను చూసి పారిశ్రామిక వేత్తలు మోసపోవద్దని.. బీఆర్ఎస్ వచ్చిన తర్వాత వెనక్కు తీసుకుంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. "చట్టం తీసుకొచ్చి చర్యలు తీసుకుంటాం.. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగం కావద్దని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నాం.. ఫ్యూచర్ సిటీ పేరిట అక్కడ, హిల్ట్ పేరిట ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు.. కోకాపేటలో వందల కోట్లు జీడిమెట్ల ప్రాంతంలో కోటి రూపాయలు అంటే ఎలా? గజం 4000 రూపాయల చొప్పున కార్మికులకు ఇవ్వండి.. రేవంత్ రెడ్డి అవినీతి అనకొండ.. ఢిల్లీకి మూటలు పంపేందుకు, దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారు.. బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదు.. హైదరాబాద్ లో అందరికీ అవగాహన కల్పిస్తాం... సమావేశాలు పెడతాం, న్యాయస్థానాల్లో పోరాడతాం .. రౌండ్ టేబుల్ సమావేశాలు, అఖిల పక్ష సమావేశాలు పెడతాం.. నిజ నిర్ధారణతో పాటు ధర నిర్ధారణ చేస్తాం.. గ్రిడ్ పాలసీలో ఐటీ పరిశ్రమలు పెట్టమని చెప్పాం... దాన్ని ఎలా తప్పు పడతారు.. హిల్ట్ పాలసీలో మల్టీ పర్పస్ అంటున్నారు.. ఓఆర్ఆర్ కేవలం లీజుకు ఇస్తే రేవంత్ రెడ్డి నాడు ఏమన్నారు?.. ఇవాళ ఐదు లక్షల కోట్ల విలువైన భూములను శాశ్వతంగా రాసిస్తున్నారు.. ఎవరి ప్రయోజనాల కోసం ఈ భూములను ధారాదత్తం చేస్తున్నారు?.. భూములను ప్రజలు, కార్మికుల కోసం ఉపయోగించుకోండి.. హైదరాబాద్ లో లక్షల మంది ఇండ్ల కోసం దరఖాస్తు పెట్టుకున్నారు... వారికి ఇండ్లు కట్టించి ఇవ్వండి.. పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేస్తామంటే ఎలా?.. హైడ్రా పేరిట పేదల గుడిసెలు తొలగిస్తున్నారు. పెద్దవాళ్ళకు మాత్రం ధారాదత్తం చేస్తున్నారు.. హిల్ట్ పాలసీ బయటకు ఎలా వచ్చిందని ప్రభుత్వం గింగిరాలు తిరుగుతోంది.. దోపిడీ జరుగుతుంటే ఎవరో తెలంగాణ బిడ్డ సమాచారం ఇచ్చారు.. హిల్ట్ భూముల విషయంలో ఇది ఆరంభం మాత్రమే పోరాటం ఇంకా కొనసాగిస్తాం కార్మిక సంఘాలతో కలిసి పోరాటం చేస్తాం.." అని మాజీ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.



# రాజీవ్, ఇందిర పేర్లేనా.. శ్రీకాంతాచారి పేరు ఏది?

- **ఒక్క ప్రాజెక్టుకైనా శ్రీకాంతాచారి పేరు పెట్టారా? అని కాంగ్రెస్‌ను ప్రశ్నించిన కవిత**
- **అమరులను గౌరవిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి విస్మరించారని విమర్శ**

ప్రాజెక్టులకు రాజీవ్, ఇందిర, మన్మోహన్ పేర్లు పెడుతున్నారని ఆరోపణ తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి పేరును రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకైనా పెట్టారా? అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. అమరులను గౌరవిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ హామీని విస్మరించిందని ఆమె తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులకు రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్ వంటి వారి పేర్లను పెడుతోందే తప్ప, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తించడం లేదని ఆరోపించారు. నిజమైన త్యాగాలు చేసిన తెలంగాణ బిడ్డల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ అమరుల ఆశయ సాధన కోసం, వారి త్యాగాలను స్మరించుకోవడం కోసం పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

# క్వాంటం ఎకానమీ లీడర్ గా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

నిలుస్తుందనీ డిప్యూటీ సీఎం తెలిపారు. 1980వ దశకం లోనే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గురించి మాట్లాడుకున్నామని రాబోయే రోజుల్లో ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నడిపిస్తుందని ఆ రోజుల్లోనే తాము హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులుగా చర్చించుకున్న విషయాన్ని సభలో డిప్యూటీ సీఎం పంచుకున్నారు.

క్వాంటం టెక్నాలజీ ప్రపంచాన్ని ఏ ఇతర సాంకేతికత కంటే వేగంగా అన్ని రంగాల్లోనూ మార్పు తీసుకురాబోతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

గొప్ప భవిష్యత్తు కోరుకునే ఏ దేశానికైనా క్వాంటం వ్యూహం అవసరం అని అన్నారు. దేశాల భవిష్యత్తు, వారి జాతీయ భద్రత, వారి ఆర్థిక పరిమాణం, అభివృద్ధి , అన్నింటినీ ఇది పెద్ద స్థాయిలో ప్రభావితం చేస్తుందనీ తెలిపారు.జాతీయ మిషన్‌కు అనుసంధానంగా రూపొందించిన తెలంగాణ క్వాంటం వ్యూహం (TQS), పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, విద్య, మౌలిక వసతులు, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో ఏకీకృత, భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకున్న లక్ష్యాలను సాధిస్తుంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. TQS ప్రారంభంతో పాటు, భారత దేశంలో అత్యంత ఆధునిక క్వాంటం ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను నిర్మించాలన్న మా రాష్ట్ర సంకల్పాన్ని ప్రపంచానికి ఈ వేదిక ద్వారా ప్రకటిస్తున్నాం అన్నారు. మేము కేవలం వ్యూహరచననే కాకుండా, అమలుకు రోడ్డు మ్యాప్ ను ఆవిష్కరిస్తున్నాం అని డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క తెలిపారు.బలమైన, లోతైన పరిశ్రమ, విద్యాసంస్థల భాగస్వామ్యాలను మేము ప్రోత్సహించబోతున్నాం అన్నారు.



క్వాంటం టెక్నాలజీ తెలంగాణతో పాటు భారత ఆర్థిక వృద్ధికి కీలకాధారం కానుంది అని డిప్యూటీ సీఎం వివరించారు.

ఇది అన్ని రంగాల్లో గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడానికి, నిలుపుకోవడానికి సహాయపడుతుంది, మా పరిశోధన, ఆవిష్కరణ ప్రణాళికలకు ఇది అత్యంత కీలకం అని తెలిపారు. స్టార్టప్‌ల లక్ష్యాలను చేరుకోవడంలో కూడా క్వాంటం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. ఈ రోజు, మేము యువ భారత్ స్టార్టప్ ఫండ్‌ను ₹ 1,000 కోట్లతో స్థాపిస్తున్నామని ప్రత్యేకంగా చెప్పాలి,

క్వాంటం స్టార్టప్‌లు మా ప్రధాన దృష్టి అని డిప్యూటీ సీఎం ఉద్ఘాటించారు. ప్రయోగశాలలలోని పరిశోధన నుంచి మార్కెట్లోని వ్యాపార, అనుబంధ విభాగాల వరకు పూర్తి క్వాంటం విలువ శృంఖల (valuechain)ను ఎలా నిర్మించాలన్న దానికి తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా మారడానికి మేము కృషి చేస్తాము అని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు.క్వాంటం కేవలం వ్యాపారం లేదా ఆర్థికాభివృద్ధికే కాదు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాల పెంపుకు కూడా కీలకం అని తెలిపారు తెలంగాణ విస్తృతమైన శాస్త్రీయ, విధాన దృక్పథం, కార్యసాధన శక్తి ఈ మూడింటినీ కలిపి, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమ, ప్రభుత్వం భాగస్వాములుగా పనిచేసే బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తుంది అని డిప్యూటీ సీఎం అన్నారు. మన దేశం ఒక గొప్ప "క్వాంటం లీప్" తీసుకుంటున్న ఈ రోజును మనమందరం కలిసి జరుపుకుందాం అన్నారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు తో పాటు నీతి ఆయోగ్ సీఈవో బి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం, సభ్యులు డా. వి.కె. సారస్వత్, శ్రీమతి దేబ్జాని ఘోష్ , స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఐఐఐటిహైదరాబాద్, ఐఐటీహైదరాబాద్, సి.ఆర్. రావు ఇన్‌స్టిట్యూట్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ప్రముఖులు పాల్గొన్నారు.



# పార్టీలకతీతంగా పరిపాలన కొనసాగిస్తున్నాం

మొదటిపేజీ తరువాయి

రెండు కళ్లలాంటివి. ఆ దిశగా ఒకరోజు కూడా సెలవు లేకుండా, ప్రజల అభ్యున్నతే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్నాను'' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సీఎం ఇంకా మాట్లాడుతూ - ''చిన్న వయసులోనే ఈ స్థాయిలో బాధ్యతలు రావడం ప్రజల దీవెన, దేవుని సంకల్పం. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. గత పదేళ్లు విపక్ష ఎమ్మెల్యేలకు ప్రభుత్వం తలుపులు మూసేసిన పాలనను చూశాం. సచివాలయంలోకే రానివ్వని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే మేము అలా కాదు. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేసే దిశగా అందరికీ అవకాశం కల్పిస్తున్నాం'' అన్నారు. తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి - ''ఏ ఆశయంతో సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారో, అది గత పదేళ్లలో నెరవేరలేదు. అందుకే 'తెలంగాణ రైజింగ్-2047' పేరుతో అభివృద్ధి లక్ష్యాలను స్పష్టంగా పేర్కొంటూ డాక్యుమెంటరీ సిద్ధం చేశాం. పెట్టుబడులు తీసుకురావడానికి ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాదులో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నాం'' అని వివరించారు. ఇంద్రవెల్లి ఆత్మగౌరవ ఉద్యమాన్ని గుర్తుచేసుకున్న సీఎం - ''పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఇంద్రవెల్లి స్ఫూర్తితోనే పోరాటాలు ప్రారంభించాను. అధికారంలోకి వచ్చిన తొలి వారంలోనే ఇంద్రవెల్లి అమరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే ఫైల్‌పై సంతకం పెట్టాను'' అని అన్నారు.సింధు-ప్రాణహిత నీటి ప్రాజెక్టులపై మాట్లాడుతూ - ''ఆదిలాబాద్‌కు సాగునీరు అందించాలనే లక్ష్యంతో వైఎస్ఆర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం దాన్ని పక్కనబెట్టి రూ.లక్ష కోట్ల భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును మార్చారు. మూడేళ్లకే ఆ ప్రాజెక్టు కూలిపోయింది. ప్రజల డబ్బులతో కట్టిన ఆ ప్రాజెక్టును దోపిడీకి మార్గం చేశారన్న విషయం ఇవాళ ప్రజలకే స్పష్టమవుతోంది'' అని ఆయన విమర్శించారు.''అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి వద్దే పూర్తిస్థాయిలో నిర్మించి ఆదిలాబాద్‌కు సాగునీరు అందిస్తాం'' అని సీఎం తెలిపారు. ఉద్యోగాల విషయాన్ని ప్రస్తావిస్తూ - ''ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక మరో 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తాం. యువతకు అవకాశాలు పెంచడమే మా ప్రభుత్వం లక్ష్యం'' అని హామీ ఇచ్చారు.బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు ప్రజలు భారీగా పాల్గొన్నారు.



# సెంటిమెంట్ రగిలించే కుట్ర

- **బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెడితే తప్పేంటి**
- **ఆయన ఓ ప్రాంతానికి పరిమితం కాదు కదా**
- **కిషన్ రెడ్డి బీఆర్ఎస్ కోసం పనిచేస్తున్నారు**
- **పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు**

హైదరాబాద్, ప్రజాస్వరం

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తెలంగాణ సెంటిమెంట్‌ను రగిలించాలని చూస్తోందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కామెంట్లను బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడం సరికాదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యగానీ, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానీ ఒక్క ప్రాంతానికే పరిమితమైన వ్యక్తులు కాదు. వీరు దేశానికే సంపద. బాలయ్యగారి విగ్రహాన్ని రవీంద్రభారతిలో ప్రతిష్ఠించడం తప్పా? ఇది తెలంగాణ సెంటిమెంట్‌కు వ్యతిరేకమా? ఇలాంటి చిన్న చిన్న విషయాలను కూడా బీఆర్ఎస్ నేతలు తెలంగాణ గొడవగా మార్చి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు."

కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నేత జీ కిషన్‌రెడ్డిపైనా మహేశ్‌కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు. "కిషన్‌రెడ్డిగారు బీఆర్ఎస్ కోసమే పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న హిల్ట్ (హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ & ట్రాన్సిట్) పాలసీని కూడా ఆయన గట్టిగా సమర్థించారు. "ఈ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు ఇళ్ల స్థలాలు అందుబాటు ధరల్లో లభిస్తాయి. నగరం కాలుష్య రహితంగా, ఆధునిక నగరంగా మారుతుంది. కానీ అవినీతిలో మునిగిపోయిన కేసీఆర్ కుటుంబానికి మా ప్రభుత్వం ఏ మంచి పని చేసినా అది అవినీతే అనిపిస్తుంది. అవినీతికి అలవాటు పడిన వాళ్లకు నిజాయితీ ఉన్న పాలన కంటికి కునుకు లాగా కనిపిస్తుంది" అని ఎద్దేవా చేశారు.





# మన చేనేత కళలను మనం పరిరక్షించుకోవాలి

హైదరాబాద్ ప్రజాస్వరం

మన చేనేత కళలను మనం పరిరక్షించుకోవాలని, భారతీయ సంస్కృతిలో చేనేత వృత్తులు ప్రధాన భూమిక పోషిస్తాయని తెలంగాణా హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. గురువారం శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటుచేసిన సిల్క్ ఎగ్జిబిషన్ ను ఆమె ప్రారంభించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలోని చీరలు కళాత్మక నైపుణ్యానికి, నాణ్యమైన పట్టు ఉత్పత్తులకు వేదికగా నిలుస్తాయని అన్నారు. దేశంలో 14 రాష్ట్రాలకు చెందిన చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఇక్కడి చీరలు మహిళలకు ఆకట్టుకుంటాయని, చేనేతకారులకు ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని, ఇండియన్ సిల్యాలరీలో చీరలను మహిళలు సందర్శించి చేనేతకారుల పనితీరును తిలకించాలని కోరారు. దేశంలోని అన్నిప్రాంతాల చేనేతకారులకు ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్ లను ప్రశంశించారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి, పలు శుభకార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, బెనారస్, కొలకతాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్లో ఏర్పాటుచేశామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ సహకారంతో చేనేతకారుల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్ లో 80 స్టాల్స్ వినియోగదారులకు ఈనెల 10వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## సృజనాత్మకతను పెంపొందించేందుకు

# వైజ్ఞానిక ప్రదర్శనలు



- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం) :**

జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా విద్యా శాఖ అధికారులు గురువారం మెదక్ జిల్లా కేంద్రం వెస్లీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా విద్యాధికారి విజయ తో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంచుకున్నటువంటి థీమ్, సబ్ థీమ్లు అభిరుచులకు తగ్గట్టుగా ఈ కాలానికి, మన దేశానికి అవసరమైనటువంటివిగా ఉన్నాయన్నారు. విద్యార్థులు కేవలం సైన్స్ చదవడం కాకుండా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని తమ జ్ఞానాన్ని ఇంకా పెంపొందించుకోవాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ ద్వారా అందుబాటులో ఉన్నటువంటి ఏ ఐ ఆప్స్ ద్వారా ఎటువంటి సమాచారాన్ని అయినా సరైన సూచనలు ఇచ్చి మనం పొందగలిగే అవకాశం ఉన్నందున విద్యార్థులు ఈ యొక్క అవకాశాన్ని మంచికి ఉపయోగించి తమ జ్ఞానాన్ని పెంపొందించుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఆయన సూచించారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా లాంటి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకొని మన పాఠశాల విద్యార్థులందరికీ కోర్స్ మెటీరియల్ పొందే అవకాశం కల్పించిందని తమ వద్ద ఉన్నటువంటి స్మార్ట్ ఫోన్ల ద్వారా ఉపాధ్యాయుల సహకారంతో ఖాన్ అకాడమీ ఫిజిక్స్ వాలా కి సంబంధించిన బోధన వీడియోలు వీక్షించాలని, కాలాన్ని వృధా చెయ్యరాదని, స్మార్ట్ ఫోన్ ను మంచి పనులకు ఉపయోగించాలని ఆయన అన్నారు. సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులని కలెక్టర్ ప్రశసించారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయ మాట్లడుతూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, తమ తమ అభిరుచి, ఆసక్తి అనుగుణంగా తమ కోర్స్లు ఎంచుకొని జీవితంలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఇందుకు గాను ఉన్న సౌకర్యాలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని అన్నారు. ప్రదర్శన గదులలోని ప్రాజెక్టలని.. కలెక్టర్ ప్రారంభించి వీక్షించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు, పరికరాలను వీక్షించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమం లో సైన్స్ ఫెయిర్ 425 ఇన్స్పైర్ 50 ప్రాజెక్టలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.







# క్రీడా పోటీల్లో విజేతలకు ఎస్పీ అభినందనలు

**మెదక్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం) :**

రైసింగ్ డే వేడుకలలో భాగంగా రెండు రోజులుగా మెదక్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రాంగణంలో నిర్వహించిన క్రీడా పోటీల తుది మ్యాచ్‌లు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు హాజరై రామాయంపేట్ సర్కిల్, మెదక్ సర్కిల్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ భరిత వాలీబాల్ ఫైనల్ ను వీక్షించారు. ఈ పోటీలో మెదక్ సర్కిల్ అద్భుత ప్రతిభ కనబరిచి మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ ద్వితీయ స్థానం సాధించాయి. కబడ్డి పోటీల్లో అల్లాదుర్గ్ సర్కిల్ మొదటి స్థానం, రామాయంపేట సర్కిల్ రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి. మ్యూజికల్ చైర్ పోటీలో భూలి మొదటి స్థానం, లావణ్య ద్వితీయ స్థానం సాధించి మంచి ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రైసింగ్ డే సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో హోమ్ గార్డ్ సిబ్బంది చూపిన ప్రతిభ నిజంగా అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ఆసక్తి, క్రమశిక్షణతో భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొనే స్థాయికి ఎదగాలని సూచించారు. హోమ్ గార్డ్ సిబ్బందికి రైసింగ్ డే సందర్భంగా క్రీడాలు నిర్వహించడంపై సిబ్బంది ఆనందం వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, ఆర్ఐ లు రామ కృష్ణ, శైలందర్, ఆర్ ఎస్సై లు సిబ్బంది ఉన్నారు.









# త్వరలో ప్రారంభం కానున్న సాండ్ బజార్



- **సాండ్ బజార్ తో ఇసుక అక్రమ రవాణాకు చెక్**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం) :**

నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు త్వరలో ఇసుక సమస్య తీరబోతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సాండ్ బజార్ ను ప్రారంభిస్తున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలోని ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు ఇసుక సమస్యను పరిష్కరించడానికి, మంచి చవకైన, నాణ్యమైన ఇసుకను ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు అందించడానికి త్వరలోనే సాండ్ బజార్ ప్రారంభిస్తున్నామన్నారు. సాండ్ బజార్లో ఒక మెట్రిక్ టన్ ఇసుక సుమారుగా 1200 రూపాయలకే లభిస్తుందని, నూతనంగా ప్రారంభించుకోబోయే సాండ్ బజార్లో 1000 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ ఇప్పటికే వచ్చి ఉన్నట్లు తెలిపారు. సౌండ్ బజార్ త్వరగా ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సాండ్ బజార్ ఏర్పాటైన తర్వాత ఇసుక అక్రమ రవాణా నిర్మూలించగలం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజయ్ కుమార్, లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.



# పదవులు వేలం వేస్తే చట్టరీత్యా క్రిమినల్ కేసులు





- పోటీ చేసే అభ్యర్థులను వత్తిడి తెచ్చి, భయభ్రాంతులకు గురిచేస్తే కఠిన శిక్ష
- ఎన్నికల సంఘం ఆదేశాలు పాటించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం) :** ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పదవులు వేలం వేస్తే క్రిమినల్ కేసులు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కౌడిపల్లి మండల కేంద్రంలోనీ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ నామినేషన్ రేపు పూర్తవుతుందన్నారు. అధికార్లు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నామినేషన్ స్వీకరించాలన్నారు. నామినేషన్ ప్రక్రియ ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులు అర్హత గల అన్ని పత్రాలు సమర్పించాలన్నారు. రిజర్వేషన్ అభ్యర్థులకు కుల సర్టిఫికెట్లు త్వరగా ఇవ్వాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అభ్యర్థులందరూ నూతన బ్యాంక్ అకౌంట్ తీయాలని ఎన్నికల ఖర్చులన్నీ నూతన బ్యాంక్ అకౌంట్ తోనే లావాదేవీలు జరగాలన్నారు. సర్పంచు,వార్డు పదవులకు లాంటి వేలం పాటలు పెట్టరాదు అన్నారు. పోటీ చేసిన అభ్యర్థులను వత్తిడి తెచ్చి, భయభ్రాంతులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు బుక్ చేస్తామన్నారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలో తూచా తప్పకుండా పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## వాహనాల తనిఖీలు నిర్వహించిన ప్రత్యేక బంధం

**నార్సింగ్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం) :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతి పూర్వకంగా, ఓటర్లకు ప్రలోభాలకు గురి చేయకుండా సజావుగా సాగడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల సాధారణ పరిశీలకులు భారతి లక్పతి బాయి, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ మండలం లో నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షించిన సందర్భంగా ఎన్నికలు పారదర్శకంగా శాంతియుతంగా సజావుగా సాగడానికి ఓటర్లకు ప్రలోభాలకు గురి చేయకుండా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని అప్పట్లో ఆదేశించారు. వారి ఆదేశానుసారం, ఎన్నికలు సజావుగా జరగడానికి తీసుకుంటున్న చర్యలలో భాగంగా మండలానికి ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ సభ్యులైన స్థానిక ఆర్.ఐ శ్రీధర్, ఏఎస్ఐ మిస్బాహ్ ఉద్దీన్ లు మండల పరిధిలోని జాతీయ రహదారి 44 పై వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయగా స్క్వాడ్ టీమ్ వీడియోగ్రాఫర్ వేణు తనిఖీని చిత్రీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక ఎన్నికల నోటిఫికేషన్ కోడ్ అమలులో ఉందని, అందులో భాగంగానే ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు లో ఉన్నందున ఎవరైనా సరైన పత్రాలు లేకుండా పరిమిత 50 వేలకు మించి నగదు కలిగి ఉంటే ఆ డబ్బును సీజ్ చేస్తామని, సరైన పత్రాలు సమర్పించిన అనంతరం డబ్బును రిలీజ్ చేస్తామని అన్నారు. అభ్యర్థులు ఎన్నికల చట్టానికి లోబడి నడుచుకోవాలని అన్నారు. ఓటర్లకు, ప్రత్యర్థులకు ప్రలోభాలకు గురి చేసినా, బెదిరింపులకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



## ప్రభుత్వం రైజింగ్ పేరుతో నాటకం చేస్తోంది

**తెలంగాణ బ్యూరో డిసెంబర్ 04(ప్రజాస్వరం).** రెండేళ్ల పాలనలో రూ. 2 లక్షల కోట్లకు పైగా కొత్త అప్పులు మోపిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు తమ పాలనా వైఫల్యాలను దాచిపెట్టేందుకు తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ అనే పేరుతో కొత్త నాటకం ఆడుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి ఎన్. వి. సుభాష్ విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ సమ్మిట్ కేవలం ప్రచార ఆర్భాటాలు మాత్రమేనని కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగం చేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేని తమ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ఖరీదైన కార్యక్రమం తప్ప మరేమీ లేదన్నారు. అసలు తెలంగాణ రైజింగ్ కాదని, రైజింగ్ డెట్స్, రైజింగ్ ఇన్‌ఫ్లేషన్, రైజింగ్ పవర్ టారిఫ్స్, రైజింగ్ లైస్ మాత్రమే పెరుగుతున్నాయని దుయ్యబట్టారు. రేవంత్ ప్రభుత్వంలో నిజంగా 'రైస్' అవుతున్న విషయం ఏదైనా ఉంటే, అది అప్పు తీసుకునే దురాశ, ప్రచారం కోసం ఖర్చు చేసే పిచ్చి మాత్రమేనంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్న క్యూర్, ప్యూర్, రేర్అనే స్లోగన్లు కేవలం సింబాలిక్ గిమ్మిక్స్, అసలు ఆర్థిక పతనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని విమర్శించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాలను కూడా క్లియర్ చేయలేని పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఒక్కటీ నెరవేర్చకుండా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇలాంటి ఈవెంట్లు నిర్వహించడం ప్రజా ధనాన్ని బహిరంగంగా దుర్వినియోగం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.


## ఎన్నికలలో ప్రవర్తన నియమాలు పాటించాలి..

- సర్పంచ్. వార్డు సభ్యుల అభ్యర్థులకు అవగాహన....



**దౌల్తాబాద్ డిసెంబర్ 04(ప్రజాస్వరం).** రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా ప్రజాస్వామ్య విలువలను కాపాడే విధంగా ప్రవర్తించాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. గ్రామపంచాయతి ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు స్థానిక జీ ఎల్ ఆర్ గార్డెన్ లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాయపోల్ ప్రజలు చాలా మంచి వారని, ఏవిధమైన కేసులలో ఇరుక్కోకుండా ఎన్నికలలో పోటీ చేయాలనీ, అనుమతి లేకుండా సభలు సమావేశాలు నిర్వహించ రాదనీ తొగుట సీఐ లతీఫ్ తెలిపారు.ఈ సమావేశంలో ఎస్సై మానస, సహాయ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు శ్రీవల్లి, మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్ మరియు వార్డ్ మెంబర్ అభ్యర్థులు పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విగాథం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు... సిఐ వెంకట్ రాజు గౌడ్



**నార్సింగి డిసెంబర్ 04 (ప్రజా స్వరం)** రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఈ నెల 14 న జరగనున్న నేపథ్యంలో స్థానిక ఎస్బీఐ బ్యాంక్ వద్ద రామాయంపేట సీఐ వెంకట రాజు గౌడ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల లో భాగంగా మండలాన్ని సందర్శించి, ప్రజలలో అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి సహకరించాలని, ఎవరైనా ఓటర్లకు మభ్యపెట్టడానికి మద్యం, డబ్బు పంపిణీ చేసినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. అలా కాకుండా స్వయంగా పట్టుకోవడానికి ప్రయత్నిస్తే గొడవలు జరిగే ఆస్కారం ఉందని, సమాచారం అందిస్తే తాము చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే వాట్సప్ గ్రూపులలో, సోషల్ మీడియాలో విమర్శించడానికి అభద్ర, పరుష పదజాలం వాడడం వల్ల గొడవలు జరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని అన్నారు. విమర్శించాలని అనుకున్నప్పుడు భావం, భాష పై నియంత్రణ కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల సమయంలో కేసులలో చిక్కుకుంటే చర్యలు, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, అనవసర భావోద్వేగాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. ఆహ్లాదపూర్వక, శాంతి పూర్వక వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి అభ్యర్థులు, నాయకులు, ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, శాంతియుత సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని సీఐ వెంకట రాజు గౌడ్ విజ్ఞప్తి చేశారు. మీడియా మిత్రులు కూడా ప్రజలలో ఓటు హక్కు వినియోగం, ఎన్నికల ఆవశ్యకత, పారదర్శకత పై ప్రజలలో చైతన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బీమరి సృజన, పోలీసు సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# రెండు జీపీలు ఏకగ్రీవం..

**దౌల్తాబాద్ డిసెంబర్ 04( ప్రజాస్వరం ).** సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను రెండు ఆరేపల్లి గ్రామంలో ఒకే అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనది. కొత్తపల్లి గ్రామంలో ఇద్దరు నామినేషన్ వేగా ఒకరు ఉపసంహరించుకోగా సర్పంచ్ అభ్యర్థి ఏకగ్రీవమైనది. 17 గ్రామ పంచాయతీలలో 51 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే 166 వాల్డు సభ్యులకు 372 నామినేషన్లు రాగా, 28 మంది విత్ డ్రా చేసుకున్నారు, 134 వార్డు లకు 312 మంది బరిలో ఉన్నారు....

**పల్లెలో వేడెక్కిన రాజకీయం...**

గ్రామ పంచాయతీ ఎన్నికల్ల కోలాహలం గ్రామాల్లో వేడేకింది.నామినేషన్లు.పరిశీలన.వితుడ్రాలు బుధవారం సాయంత్రం ముగిసింది. ఆయితే సంబంధిత గ్రామాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు.దింతో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వాతావరణం వేడెక్కింది.ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేపట్టారు.మండలంలోని 19 జీపీలు ఉండగా అందులో రెండు జీపీలు అయిన పెద్ద అరేపల్లి. కొత్తపల్లి గ్రామ పంచాయతీల సర్పంచ్ లు ఏకగ్రీవం అయ్యారు. మరో 17,జీపీలలో ఎన్నికలు కొనసాగుతున్నాయి.అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.





# నర్సంపల్లి–లింగాయపల్లి తాండల్లో సర్పంచ్, వార్డు సభ్యులు ఏకగ్రీవం









- గ్రామాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తామని నేతలు

**దౌల్తాబాద్, డిసెంబర్ 04 (ప్రజా స్వరం):** గ్రామాల అభివృద్ధి కోసం ఏకమై ముందుకు సాగితేనే స్వరంశాశ్వత పరిష్కారాలు సాధ్యమవుతాయని నర్సంపల్లి సర్పంచ్ దుబాసి లక్ష్మి యాదయ్య, లింగాయపల్లి తాండ సర్పంచ్ బానోత్ లక్య నాయక్ పేర్కొన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని నర్సంపల్లి, లింగాయపల్లి తాండ గ్రామాల్లో సర్పంచ్, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణ స్వీకారం నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ – "పార్టీలకు అతీతంగా ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. గ్రామ సమస్యలన్నిటినీ దశలవారీగా పరిష్కరించి, మా గ్రామాలను మండలంలో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దటమే మా లక్ష్యం" అని సర్పంచ్‌లు తెలిపారు.గ్రామాలలోని ప్రతి కుటుంబానికి అందుబాటులో ఉంటూ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల సూచనలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. రెండో విడత, మూడో విడతలో జరిగే గ్రామపంచాయతి ఎన్నికలకు తమ గ్రామాల ఏకగ్రీవ తీరు ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.

**ఉపసర్పంచ్‌లు**

నర్సంపల్లి : దొడ్డి ఆంజనేయులు
లింగాయపల్లి తాండ : భానోత్ చాందియా (ఏకగ్రీవం)

**ఏకగ్రీవంగా ఎన్నికైన వార్డు సభ్యులు**

దుబాసి భాస్కర్, వేమ లత, బండల శేఖర్, వేమ లావణ్య, వెంగళ స్వామి, సత్యలక్ష్మి, దుబాసి పెద్ద నవీన్, రామచంద్రం, బిక్షపతి, స్వరూప, లలిత, శాంతి, సరిత.


నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు గ్రామస్తులు శాలువాలతో ఘన సన్మానం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఇచ్చిన గౌరవానికి తగ్గట్లు బాధ్యతలను నిర్వర్తిస్తాం అని సర్పంచ్‌లు హామీ ఇచ్చారు.

## 'అఖండ 2' ప్రీమియర్స్ రద్దు..



బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అఖండ2: తాండవం'. డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 4న రాత్రి స్పెషల్ ప్రీమియర్ షో వేయనున్నట్లు తొలుత 14 రీల్స్ ప్లస్ ప్రకటించింది. అయితే, సాంకేతిక కారణాలతో ప్రీమియర్ షో రద్దు చేసినట్టు చిత్ర బృందం తెలిపింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఓవర్సీస్‌లో మాత్రం యథావిధిగా ప్రీమియర్స్ ప్రదర్శన ఉంటుందని స్పష్టం చేసింది.


## సంయుక్త మీనన్ రెమ్యునరేషన్ కోసం కక్కుర్తి పడిందా?



సాధారణంగా నటీమణులు తమ కెరీర్‌లో ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకోవడానికి చాలా కష్టపడతారు. ఆ ఇమేజ్‌ని కాపాడుకోవడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. అలాంటి వారిలో ముందు వరుసలో ఉంటుంది నటి సంయుక్త మీనన్. అచ్చం పద్ధతికి లంగా ఓణీ వేసినట్టుగా, తెలుగు ప్రేక్షకులకు ఎంతో నచ్చిన డిగ్నిఫైడ్ రోల్స్ చేసిన సంయుక్త, ఇప్పుడు తీసుకున్న ఒక నిర్ణయం అభిమానులను, సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. సంయుక్త మీనన్ అంటే, అందమైన నవ్వు, చక్కటి నటన, ముఖ్యంగా గ్లామర్‌కు దూరంగా, డీసెంట్‌గా కనిపించే పాత్రలే గుర్తొస్తాయి. 'సార్', 'బింబిసార', 'విరూపాక్ష' వంటి చిత్రాల్లో ఆమె పోషించిన పాత్రలు ఆమెకు ఎంతో మంచి పేరు తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా 'సార్' సినిమాలో టీచర్‌గా ఆమె చేసిన డిగ్నిఫైడ్ రోల్, సాయి పల్లవి, నిత్యా మీనన్ వంటి నటీమణుల తరహాలో పెర్ఫార్మెన్స్‌కే ప్రాధాన్యత ఇస్తుందనే మంచి అభిప్రాయాన్ని క్రియేట్ చేసింది.అయితే, తాజాగా బాలకృష్ణ -బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ 2' చిత్రంలోసంయుక్తఐటమ్‌సాంగ్ ('జాజికాయ సాంగ్') చేయబోతోందనే వార్త అందరినీ షాక్‌కి గురిచేసింది. అంతేకాకుండా, అందులో ఆమె చేసిన స్కిన్ షో, మాస్ స్టెప్పులు గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉండటం అభిమానుల మనసుల్లో పెద్ద ప్రశ్నను లేవనెత్తింది. ఈ అనూహ్యమైన మార్పు వెనుక కారణం ఏమిటనే చర్చ సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. మెయిన్ హీరోయిన్‌గా కాకుండా, కేవలం ఒక పాట కోసం ఇంతటి గ్లామర్ డోస్‌ను పెంచాల్సిన అవసరం సంయుక్తకు ఏమొచ్చింది? సాధారణ పాత్రల కంటే మాస్ హీరోల సినిమాల్లో ఐటమ్ సాంగ్స్‌కి ఇచ్చే పారితోషికం (రెమ్యునరేషన్) చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే, భారీ మొత్తంలో పారితోషికం ఆశించి సంయుక్త ఈ పాట చేయడానికి ఒప్పుకుందని భావిస్తున్నారు.

## స్పిరిట్ షూట్‌కు బ్రేక్.. జపాన్‌కు ప్రభాస్

గ్లోబల్ స్టార్ యాక్టర్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ప్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో 2025 డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం రేపు జపాన్‌లో అభిమానులతో చిట్ చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతిప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.



## పెళ్లి వార్తలపై స్పందించిన రష్మిక..

టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న వివాహంపై గత కొన్ని రోజులుగ వాడి వేడి చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వీరి పెళ్లి జరగనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవలే రష్మిక అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించిందన్న సమాచారం బయటకు రావడంతో ఈ రూమర్స్ మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరు నటుల తరపున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక తన వివాహ వార్తలపై మొదటిసారి స్పందించింది.

రూమర్స్‌ను ఖండించలేనని, ప్రస్తుతం మాత్రం ఏ విషయాన్నీ ధ్రువీకరించలేనని చెప్పింది. తన పెళ్లి గురించి ఎప్పుడు మాట్లాడాలో, వివరాలు ఎప్పుడు షేర్ చేసుకోవాలో అనే విషయం తనకే తెలుసని, సరైన సమయానికి అందరితో పంచుకుంటానని రష్మిక స్పష్టం చేసింది. ఇప్పుడే ఏ వివరాలూ చెప్పలేనని రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్-రష్మికలు ఇప్పటి వరకు ఎంగేజ్మెంట్ ఫోటో కాని, అధికారిక అనౌన్స్‌మెంట్ చేయకపోవడంతో, ఇద్దరూ ప్రత్యేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది.

ఎప్పుడు అధికారిక సమాచారం వస్తుందోనని నెటిజన్స్ ఆసక్తిగా చూస్తున్నారు. గీత గోవిందంతో హిట్ కాంబినేషన్‌గా నిలిచిన విజయ్-రష్మిక, ఆ తర్వాత డియర్ కామ్రేడ్‌లో కూడా అదే కెమిస్ట్రీని కొనసాగించారు. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మరో సినిమాకు జోడీగా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి., రీల్ లైఫ్ కపుల్‌గా ప్రారంభమైన వారి బంధం ఇప్పుడు రియల్ లైఫ్ వరకూ వెళ్తోందన్న ఊహాగానాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మరి దీనిపై ఎప్పుడు క్లారిటీ ఇస్తారనేది చూడాలి. ఇక రష్మిక కెరియర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ సూపర్ హిట్స్ అందుకుంటుంది. నేషనల్ క్రష్‌కాస్త ఇప్పుడు వరల్డ్ క్రష్‌గా మారుతుంది అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే పెళ్లి తర్వాత రష్మిక సినిమాలు మానేస్తుందా లేదా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్.



## ధురంధర్.. ఆ మేజర్ కథ కాదు

రణ్‌వీర్‌సింగ్ హీరోగా నటించిన 'ధురంధర్' సినిమా కథకు, అమరుడైన మేజర్ మోహిత్ శర్మ జీవితానికి సంబంధం లేదని 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) స్పష్టం చేసింది. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు సినిమాని పునః పరిశీలించింది. అనుమతి లేకుండా తమ కుమారుడి జీవితాధారంగా 'ధురంధర్'ను తెరకెక్కించారంటూ మోహిత్ తల్లిదండ్రులు కొన్ని రోజుల క్రితం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మేజర్ మోహిత్ శర్మ జీవితాధారంగానే ఈ సినిమా తెరకెక్కిందన్న చర్చ మీడియా, సోషల్ మీడియాలోనూ జరిగిందని, దానిపై చిత్ర బృందం స్పందించడం గానీ, తమను సంప్రదించడం గానీ చేయలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ సినిమాని తాము ప్రత్యేకంగా చూసే అవకాశం కల్పించాలని, అప్పటి వరకూ మూవీ రిలీజ్‌ను ఆపాలంటూ న్యాయస్థానాన్ని కోరారు.




## ఆ విషయంలో వెనుకపడిన మెగాస్టార్ ?

సినిమాలు మళ్లీ విడుదల అవ్వడం (రీరిలీజ్‌లు) ఇప్పుడు టాలీవుడ్‌లో ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. అభిమానుల సందడి, బాక్సాఫీస్ వద్ద రికార్డులు.. ఇవన్నీ రీరిలీజ్‌లకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. అయితే, ఈ ట్రెండ్‌లో మెగాస్టార్ చిరంజీవి మాత్రం అనుకున్న స్థాయిలో సత్తా చాటలేకపోతున్నారు. ఎన్నో క్లాసిక్ హిట్స్ ఉన్నప్పటికీ, మెగాస్టార్ పాత సినిమాలు రీరిలీజ్ అయినప్పుడు బాక్సాఫీస్ వద్ద నిరాశనే మిగులుస్తున్నాయి. మెగాస్టార్ కెరీర్‌లో 'గ్యాంగ్‌లీడర్', 'ఘరానా మొగుడు', 'కొదమ సింహం' వంటి ఎన్నో మైలురాళ్లు ఉన్నాయి. ఈ చిత్రాలను మళ్లీ థియేటర్లలో చూసే అవకాశం మెగా ఫ్యాన్స్‌కు లభించినా, కలెక్షన్ల పరంగా అవి పూర్తిగా చేతులెత్తేస్తున్నాయి. 'కొదమ సింహం' వంటి సినిమాలు కనీసం 30 లక్షలు కూడా కలెక్ట్ చేయలేకపోయాయి. 'గ్యాంగ్‌లీడర్', 'ఘరానా మొగుడు' రీరిలీజ్‌లు కూడా ఫ్లాప్‌గా నిలిచాయి. మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ వంటి హీరోల సినిమాలు రీరిలీజ్ అయితే, లక్షల్లో, కోట్లలో వసూళ్లు సాధిస్తున్నాయి. కానీ, చిరంజీవి సినిమాలను మాత్రం మెగా ఫ్యాన్సే ఎందుకు పెద్దగా చూడడం లేదనే ప్రశ్న తలెత్తుతోంది. చిరంజీవి అభిమానుల సంఘాలు రీరిలీజ్ విషయంలో సరైన స్థాయిలో సందడిని, ప్రచారాన్ని క్రియేట్ చేయలేకపోతున్నాయా? మహేష్, పవన్ సినిమాలను 4K ఫార్మాట్‌లో అత్యుత్తమ నాణ్యతతో విడుదల చేస్తుండగా, చిరంజీవి సినిమాల పాత ప్రింట్స్ ఆ స్థాయిలో లేకపోవడం కూడా ఒక కారణంగా ఉండొచ్చు. తరచుగా చిరంజీవి పాత సినిమాలు వస్తుండటం వల్ల, అభిమానులకు ఉత్సాహం తగ్గిపోవడం జరిగిందా? రీరిలీజ్ ట్రెండ్‌లో నెంబర్ వన్ ప్లేస్‌లో లేకపోయినా, అక్కినేని నాగార్జున నటించిన 'శివ' చిత్రం మాత్రం బాగానే పర్ఫార్మ్ చేసింది. ఈ సినిమా రీరిలీజ్‌లో 4 కోట్లు వరకు రాబట్టి సత్తా చాటింది. ఈ విజయం, సీనియర్



హీరోల సినిమాలకు కూడా ఆదరణ ఉంటుందని నిరూపించింది. రీరిలీజ్ రికార్డులు ఇప్పటివరకు ఎక్కువగా మహేష్ బాబు ('పోకిరి'), పవన్ కళ్యాణ్ ('ఖుషి')లకే సొంతమయ్యాయి. ఇప్పుడు వెంకటేశ్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. రీరిలీజ్‌లలో సీనియర్ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ తరచుగా కనిపిస్తున్నారు. త్వరలో వెంకటేశ్, నాగార్జున కూడా ఈ రిలీజ్‌లకు అలవాటుపడుతున్నారు. అయితే, మెగాస్టార్ ఫ్యాన్స్ తమ అభిమాన హీరో సత్తా చాటే ఒక రీరిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## అమితాబ్‌కు కూడా అలానే జరిగింది

ఇండస్ట్రీలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు.''క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించుకోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయలేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ'' అని రకుల్ అన్నారు.బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.



## భారత్‌తో సహా 35 దేశాల్లో ట్రెండింగ్..

మనోజ్ బాజ్‌పాయ్, జైదీప్ అహ్లావత్, ప్రియమణి వంటి అగ్ర నటీనటులు కీలక పాత్రలు పోషించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' సంచలనం సృష్టిస్తోంది. ఇటీవల అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సిరీస్ ఓ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ ఏడాది అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా విడుదలైన వెబ్‌సిరీస్‌లలో అత్యధికమంది వీక్షించిన సిరీస్‌గా 'ది ఫ్యామిలీ మ్యాన్ 3' నిలిచినట్లు చిత్రబృందం ప్రకటించింది. రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ నవంబరు 21న హిందీ, తెలుగుతో పాటు పలు భారతీయ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ కొత్త సీజన్ గత రెండు సీజన్ల వ్యూస్‌ను అధిగమించినట్లు చిత్రబృందం ప్రకటించింది. స్ట్రీమింగ్‌కు వచ్చిన తొలివారంలోనే ఈ సిరీస్ ఇండియాలోని 96 శాతం పిన్‌కోడ్స్‌కు చేరువైంది. అంతేకాకుండా, భారత్‌తో పాటు యూకే, కెనడా, ఆస్ట్రేలియా, యూఏఈ, సింగపూర్, మలేషియా వంటి 35 దేశాల్లో టాప్5 ట్రెండింగ్‌లో నిలిచి అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. మరోవైపు ఈ నాలుగో సీజన్‌కి త్వరలోనే అప్‌డేట్ ఇవ్వబోతున్నట్లు ప్రైమ్ వీడియో ప్రకటించింది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999